

# ఇల జరిగిన 'కల్యాణం

ఆ పెంకుటింటిముందే రిక్షా దిగాం నేనూ, సూర్యమూ.

నేను రిక్షావాడికి డబ్బులిస్తోంటే, సూర్యం ఆ ఇంటిని పరిశీలించటం పూర్తి చేశాడు. రిక్షా వెనక్కు వెళ్ళిపోయింది. అప్పుడన్నాడు సూర్యం, తన పరిశీలనా ఫలితాల్ని ఒకే మాటలో తెలియజేస్తున్నట్లుగా 'మంచి వ్యాపారంలాగానే ఉంది ఇది!' అని.

ఉలికిపడ్డాను నేను - ఎందుకన్నాడు ఆ మాట అని!

రిక్షా దిగగానే ఆ ఇంట్లోకి వెళ్ళిపోదామన్న ఆత్రుతను చంపుకొంటూ అక్కడే నిలబడిపోయి అడిగాను సూర్యాన్ని - "ఎందుకంటున్నావ్ అలాగ?" అని.

"చూస్తే తెలీటంలేదూ! ఇంత పెద్ద పెంకుటిల్లు, ఇంటి ముందు చిన్నతోట, ఇంటికిముందు ఈగేటు, గేటుకు ఈ బోర్డు, అబ్బో, బాగానే సంపాదించి ఉంటాడు"

సూర్యం అంటున్నది నిజంలాగానే ఉంది. పరిశీలించి చూస్తోంటే ఈ మాత్రంగా

ఉండాలంటే బాగానే ఉండి తీరాలి. అయినా... ఇదంతా... ఈ 'వ్యాపారం' వల్లే? అయి ఉండకపోవచ్చు! అదే అన్నాను సూర్యంతో.

సూర్యం నవ్వాడు! "నువ్వు ఉత్త పిచ్చాడివిరా! ఇల్లు చూడు. కొత్తగా కట్టినట్లు లేదూ? ఇంత పెద్ద ఇంటిని ఇంతకు మునుపు ఎపుడైనా ఈ వీధిలో చూసిన గుర్తుందా నీకు, చెప్పు?" అనడిగాడు సూటిగా.

నిజమే.. ఈ వీధిలో రోజూ తిరగాల్సిన పనేమీ నాకు లేదు గానీ వచ్చిన సందర్భాలలో ఎప్పుడు ఇంత పెద్ద ఇంటిని ఈ వీధిలో చూసిన గుర్తులేదు.

అంటే.... సూర్యం అంటున్నది నిజమేనా?

"ఇంకా సందేహం దేనికి? నేను చెప్పింది నిజమయి ఉంటుంది. ఈ రోజుల్లో నాకు తెలిసినంతవరకు పెట్టుబడిలేని వ్యాపారాలు రెండే ఉన్నాయిరా! ఒకటి పెళ్ళిచేసుకోవటం - పెళ్ళి చేసుకొంటామని చెప్తే చాలు, ఆ వ్యాపారంలో నీకు వేలు లక్షలకొద్దీ లాభాన్ని సంపాదించి పెట్టడానికి ఆడపిల్లల తండ్రులు కట్నాల సంచులు చేతిలో పట్టుకొని సిద్ధంగా ఉంటారు. ఇక రెండో వ్యాపారం... ఇదిగో, ఇదే! పెళ్ళిచేసుకొనే వయసయిపోయింది కాబట్టి, ఇక పెళ్ళిళ్లు చేస్తామంటూ మారేజ్ బ్యూరోలు పెట్టుకోవటమే! పాతకాలంలో పెళ్ళిళ్ళ పేరయ్యలు అంటూ ఉండేవారు! అటు ఆడాళ్ళ దగ్గర, ఇటు మగాళ్ళ దగ్గరా కూడా డబ్బు గుంజటం ఒక్కటే వాళ్ళ పని. ఆ పెళ్ళిళ్ల పేరయ్యకే ఇది కొత్తపేరు - మారేజ్ బ్యూరో! పెట్టుబడిలేని రెండో వ్యాపారం...!"

సూర్యం అంటున్నది సరిగ్గానే ఉన్నట్లు తోస్తోంది నాకు. వాడి మాటల్లో రవ్వంత నిజం కూడా ఉందన్నట్లు ఆ గేటు మీద బోర్డొకటి 'యాజీ మారేజ్ బ్యూరో... స్వర్గంలో కుదరని పెళ్ళిళ్లను ఇక్కడ కుదురుస్తాం!' అని!!

'మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అని సూక్తి. అక్కడ కుదరని పెళ్లిళ్లను ఇక్కడ ఆయన కుదురుస్తాడట! ఎంత ధైర్యమో అలా చెప్పకోవడానికి!

క్షణం ఆగి అన్నాను. "పోనీ, వెళ్ళిపోదామేమిట్రా?"

"నీ ఇష్టం. నాకు ఇలాంటివి ఇష్టముండవని ముందే చెప్పాను. విన్నావు కాదు. మూతి మీద మీసం పెరిగిన మగాళ్లం. మనకు పెళ్ళికాకపోవటమేమిట్రా అంటే విన్నావు కాదు. ఇక్కడికి లాక్కొచ్చావు. ఇపుడు వెనక్కు వెళ్ళిపోదాం అన్నా, నాకేమీ అభ్యంతరం లేదు!" సూర్యం మళ్ళీ తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు.

తప్పు చేశానా అనిపించింది, నిన్న ఉదయం పేపరు చూసినప్పటినుంచి మనసులో ఇదే ఆలోచన నన్ను వెంటాడుతోంది, అందుకే ఇలా వచ్చాను!

చెప్పుకోవాలంటే సిగ్గుగా ఉంది. కానీ నిజం మరి. ఏం చెయ్యను, నాకు కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవాలని ఉంది. ఆఫీసులో ఖాళీ ఉన్నప్పుడల్లా పేపరు తిరగెయ్యటం నా హాబీ, ఏ రోజు పేపరు చదువుతున్నా ఈ మధ్యకాలంలో కట్నాలకోసం కాల్చి చంపెయ్యటాలే వార్తలుగా ఉంటున్నాయి. ఇచ్చిన కట్నం చాలలేదని కొందరు. ఇస్తామన్న కట్నం ఇవ్వలేదని

ఇంకొందరు, అది చెయ్యలేదు, ఇదివ్వలేదని మరి కొందరు. కారణం ఏదైతేనేం, ఆడపిల్లల్ని కాల్చుకుతినడం ఎక్కువయిపోయింది. ఇదివరకు ఇలాంటి వార్తలు ఉత్తరాది ఊళ్ళకే పరిమితంగా ఉండేది. ఇపుడు మన జనం కూడా ఈ విషయంలో ముందునే ఉంటున్నారు. ఆలోచిస్తోంటే అనిపిస్తుంది. - ఎందుకివ్వాలి ఆడాళ్లు కట్నం చెప్పండి! ఒకే పుట్టుక పుట్టాం గదా, మరి వాళ్ల తక్కువేమిటి, మన మగాళ్ల ఎక్కువేమిటి? ఇవే ప్రశ్నలు నన్ను నిలవనిచ్చేవి కావు.

ఒక రోజున ఇవే ఆఫీసులో అడిగాను. ఎదురు సీట్లో టైపు చేసే సుందరి ఉలికిపడింది. "ఈ రోజుల్లో కట్నం తీసుకోనివాడిని మగాడని ఎవ్వరూ అనుకోరు!" అంది తన నిశ్చితాభిప్రాయాన్ని వెల్లడి చేస్తూ.

ఈ సారి ఉలికిపడటం నా వంతయింది.

"ఏమో మరి! మా ఆయన పాతిక వేలు తీసుకొన్నాడు. ఆ విషయం చెప్పుకోవాలంటేనే నామోషీగా ఉంది నాకిప్పటికీ.... మేనమామ కొడుకు కాబట్టి పాతికవేలే ఇచ్చారు గానీ, అదే మాలో.... మా ఆయనలా ఇంజనీరింగ్ చదివితే చాలు, లక్ష ఇచ్చుకోవల్సిందే!" అంది సుందరి తన మొగుడ్ని, తక్కువ కట్నం తీసుకొన్న కారణంగా అసలు మగాడేకాదని జమ కట్టేస్తూ.

రెండో రోజున సుందరి లేనపుడు మా సెక్షన్‌లోనే పని చేస్తున్న పెళ్ళికాని పిల్ల జానకితో ఆ విషయం ప్రస్తావించాను.. "మీరన్నది నిజమే! అందుకే ఇలాంటి గొడవలన్నీ దేనికని, నేనెప్పటినుంచో రికరింగ్ డిపాజిట్ వేస్తున్నా! నెలకు అయిదొందలు.. ఇంకో రెండేళ్ళు వేస్తే యాభై వేలవుతుంది. అప్పుడు సుఖంగా పెళ్ళిచేసుకోవచ్చు!!" అందావిడ.

"మహాతల్లీ, నీకెంత ఓపికే!" అనుకున్నాను మనసులో.

అసలు ఇలాంటి విషయం ఈ ఆడవాళ్ళతో ప్రస్తావించటమే తప్పనిపించింది. లేకపోతే ఏమిటి? కట్నం తక్కువ తీసుకున్నాడని ఒక ఇల్లాలు బాధపడుతుంటే, తనెక్కువ కట్నం ఇవ్వాలని ఇంకో అమ్మాయి ప్రయత్నాలు మొదలెట్టింది. అంతేగానీ, అసలు కట్నం ఇవ్వటం తప్పు అని ఒక్కరూ అనుకోవటం లేదు. కట్నం గురించి ఇంకా ఏమైనా అన్నానంటే 'ఒకసారి మీరు మెడికల్ చెకప్‌కు వెళ్లిరండి! మీకు మెంటల్‌గానో, ఫిజికల్‌గానో ఏదో తేడా ఉండి ఉంటుంది!' అనేస్తారు జనం!

అందుకే కట్నం తీసుకోకూడదని నిర్ణయించుకొన్నా, ఆ నిర్ణయం గురించి పైకి చెప్పుకోవాలంటే భయంగా ఉంది, సిగ్గుగా ఉంది.

నిన్న ఉదయం పేపర్లో- 'యాజీ మారేజ్ బ్యూరో' వారి ప్రకటన చూశాను. తెలిసిన వాళ్ళతో చెప్పుకోలేని విషయాన్ని తెలియని వాళ్ళతో చెప్పుకోవటం చిత్రంగా ఉంటుంది! ఎదుటివ్యక్తి మనకు పరిచితుడు కాకపోవటం ఒక్కోసారి మేలే చేస్తుంది కాబోలు! అందుకే ఈ రోజు మా ప్రయాణం ఇక్కడికి!!

అయినా, ఇంతదూరం వచ్చి వెనక్కు వెళ్ళిపోవటం ఏమిటి, అనుకొంటూ ముందుకే కదిలాను. అయిష్టంగానే సూర్యం కూడా నాతో వచ్చాడు.

గేటు బయట దగ్గరున్న కాలింగ్‌బెల్ నొక్కి ఇంట్లోకి వెళ్ళాము.

వసారా దగ్గరకు వచ్చేసరికి లోపల్నించి రుద్రాక్షమాలతో, నుదుటిమీద విభూతితో, ఎర్రరంగు పట్టుపంచెతో అరవై ఏళ్ళ వయస్సున్న ఆయన వచ్చారు. ఆయనే కాబోలు యాజీ... అదే సోమయాజి, కాకుంటే సోమయాజులు!

"నమస్కారం" అన్నాను నేను. విషయాన్ని ఎలా అడగాలో, ఎలా కదపాలో కూడా తెలియటం లేదు. ఎప్పుడూ ఎరగని పరిస్థితి ఇది. అసలు నా కన్నా ముందు ఇంకో వ్యక్తి ఇలా ఇక్కడికి వచ్చి ఉంటాడా అన్నదీ సందేహంగానే ఉంది నాకు!

మాకు ప్రతి నమస్కారం చేస్తున్నట్లుగా చెయ్యి ఎత్తారాయన. క్షణం ఆగి అన్నారాయన "ఫారం నింపటానికి వచ్చారా?"

నాకు అర్థం కాలేదు, ఇక్కడ ఫారాలేమిట్రా అనుకొన్నా!

ఆయనే విశదీకరించారు. ఆ బ్యూరోలో పెళ్ళికొడుకుల, పెళ్ళికుమార్తెల వివరాలు సవివరంగానే రాసి ఉంచుతారు. ఇవన్నీ స్వయంగా వాళ్లు కానీ, వాళ్ళ వాళ్లుకానీ రాసి ఇవ్వాలి. సంతకం చేసి మరీనూ! ఇలా వచ్చిన వివరాలన్నీ నమోదు అవుతాయన్నమాట. నమోదు చేసుకోవటానికి ఏ ఫీజూ చెల్లించనక్కర్లేదు కానీ అంతక్రితమే నమోదయిన వారి వివరాలు చూడాలంటే మాత్రం అర్థ నూటపదహార్లు చెల్లించాలట!!

ఆయనా సంగతి చెప్తోంటే నేను సూర్యంకేసి చూడలేదు. కానీ నాకు సూర్యం ఏమనుకుంటూ ఉంటాడో తెలుస్తూనే ఉంది 'పెట్టుబడిలేని వ్యాపారం'!!

సూర్యంకేసి చూశానంటే నాలో ఉన్న నిర్ణయం దెబ్బతినేయవచ్చు. అందుకే అటుకేసి చూడకుండానే నేను ఫారం అందుకొని అన్ని వివరాలు రాసి ఇచ్చాను. పేరు, వయస్సు, చదువు, ఉద్యోగం, కులం, గోత్రం, కావాల్సిన కట్నం, వధువుకు ఉండాల్సిన అర్హతలు వగైరాలన్నీ... కావాల్సిన కట్నం దగ్గర 'అక్కర్లేదు!! అని రాసి అండర్‌లైన్ చేసాను. వధువు 'నచ్చితే చాలు' అన్న మాట కూడా రాశాను.

ఆ ఫారమ్ అందుకొన్నారాయన. అన్నీ చదువుకుని "సంతోషం" అన్నారు.

క్షణం తర్వాత అడిగాను. "మీ దగ్గర ఇప్పటికే నమోదయినవి చూడాలని ఉంది" అంటూనే జేబులోంచి డబ్బు తీశాను. ఆయన అడగకముందే ఇచ్చేస్తే మంచిది గదానని!

"అవి చూడాలంటే రెండు నిబంధనలున్నాయి నాయనా! ఒకటి నేను చూపించే వధువులలో ఎవరూ నచ్చకపోయినా కూడా మీ డబ్బు మీకు తిరిగి ఇవ్వం! రెండోది, ఈ వధువుల్లోంచి మీకెవరైనా నచ్చి అది వివాహానికి దారితీస్తే నాకు వెయ్యిన్నూట పదహార్లు ఇచ్చుకోవాలి మీరు. సమ్మతమైతే..." ఆగిపోయారాయన.

'సమ్మతమే' అన్నట్లు తల ఊపాను. ఆయన వెంటనే లేచి ఇంట్లోకి వెళ్ళారు. ఆయనలా వెళ్లగానే సూర్యం మొదలుపెట్టాడు "చెబితే విన్నావుగాదు. ఇపుడు అర్థనూట పదహార్లట! అప్పుడు మళ్ళీ వెయ్యిన్నూట పదహార్లుట, బాగుందా?"

"ఊరుకో!" అన్నట్లు సైగచేసి వాడి నోరునొక్కాను.

లోపల్నించి ఆయన వస్తున్న చప్పుడు వినిపించి వాడే ఊరుకొన్నాడు. ఆయన రెండు పెద్ద ఫోటో ఆల్బంల వంటివి తెచ్చి మా ముందు పడేశారు. వాటిని అందుకోబోయే ముందు అక్కడ నేను యాభై ఎనిమిది లెక్కబెట్టి మరీ ఉంచాను. ఆ తర్వాత ఆల్బం అందుకొన్నాను.

ఒక్కో పేజీ తిరగేస్తోంటే నాకు ఒక్కో జీవిత సత్యం ఎదురవున్నట్లుగా ఉంది. పద్దెనిమిదేళ్ళ నుంచి నలభై ఏళ్ళ వయసు వరకూ ఉన్న వధువులు వరుసగా క్యూలో నిలబడినట్లుగా ఉంది. ఎందుకు కావటం లేదు ఇందరికి పెళ్ళిళ్ళు? ఎక్కువ కారణం కట్నమే! 'ఇవ్వగలిగిన' కట్నం అని ఉన్న ప్రతిచోటా ఆ సంఖ్య ఐదువేలు దాటటం లేదు. ఏ ఒకరో ఇద్దరో మరింత మొత్తాన్ని వేశారు. ప్రతి పేజీలోను ఓ ఫోటో, ఆ ఫోటో కింద వారి వివరాలు, అన్నీ తిరగేస్తూ ఉండిపోయాను.

ఒక పేజీలో.. జానకి ఫోటో కూడా ఉంది. కానీ ఇవ్వగలిగిన కట్నాన్ని మాత్రం పదివేలు అనే రాసి ఉంది. అంటే మిగతా నలభై వేలు బ్లాక్‌లో ఇస్తుంది కాబోలు! నవ్వొచ్చింది నాకు!!

నా నవ్వును ఎలా అర్థం చేసుకున్నారో కాని, చిన్న ప్రశ్న మాత్రం సూటిగా అడిగారు "దేనికి బాబూ నవ్వుతున్నావ్?"

అబద్ధం చెప్పటం ఎంత కష్టమో నాకు అపుడర్థం అయింది. అతకగలిగే అబద్ధాన్ని అందంగా అల్లటం కొందరికే చేతనవుతుంది కాబోలు!

"కట్నం ఇవ్వటం పుచ్చుకోవటం నేరం కదా ఈ రోజుల్లో... మరి, మీరేమో ఇంత పబ్లిగ్గా కట్నం గురించి రాశారే!" అన్నాను.

ఆయన నవ్వారు. "మనవాళ్ళు చట్టాల్ని చెయ్యడంలో సిద్ధహస్తులే. కాదనను! కానీ ఆ చట్టాల్ని చేసే పెద్దమనుషులే లక్షలకొద్దీ కట్నాలు పోసి మరీ తమ కుమార్తెల పెళ్ళిళ్లు చేస్తున్న రోజులివి! ఆ చట్టం ప్రచురితమైన కాగితంపాటి విలువకూడా ఆ చట్టాలకు లేదన్న సంగతి మీకు చెప్పాలా చెప్పండి!" అన్నాడు.

సూటిగా, ఎంత చక్కగా చక్కని నిజం చెప్పారో అనిపించింది.

... పేజీలు తిప్పుతూనే ఉన్నాను. నా జీవితంలోకి వచ్చి నన్నూ, నా ఇంటిని ఏలే సామ్రాజ్ఞికోసం అన్వేషణ సాగిస్తూనే ఉన్నాను.

అదుగో, అప్పుడు కనిపించింది ఆ అమ్మాయి ఫోటో – భీతహరిణేక్షణ అన్నమాట పుస్తకాలలో చదువుకోవటమే గాని ప్రత్యక్షంగా చూసి ఎరుగను. కానీ ఇపుడీ అమ్మాయి ఆ పదానికి అందమైన నిర్వచనంలా, నికార్సయిన అర్థంలాగా నా ముందు నిలబడి ఉంది. చెంపకు చేరడేసి కళ్ళతో, కళ్ళ సరిహద్దుల్ని తీర్చిదిద్దిన ఆ కాటుకతో అందంగా ఉంది. ఆకట్టుకొనేలా ఉంది.

పేరు: రుక్మిణి

వయసు : నా కన్నా తక్కువే!

చదువు : చాలినంత!!

ఇచ్చుకోగల కట్నం : ఏమిలేదు! అని ఉంది.

ఉలికిపడ్డాను - కట్నం ఇచ్చుకోలేమని రాయటమే నాకు చిత్రంగా తోచింది.

ఎలాంటి రోజులివి! ఫాల్స్ ప్రెస్టిజ్ ప్రపంచాన్ని రాజ్యం చేస్తున్న రోజులివి. అలాంటి ఈ రోజుల్లో నీతిగా, నిజాయితీగా ఏమీ ఇచ్చుకోలేనని చెప్పుకోవడానికి ఎంత గుండెధైర్యం కావాలి! ఎంతటి నిజాయితీ కావాలి!!

నాకు ఆ అమ్మాయి, నా మనసుకు ఆమె నిజాయితీ నచ్చాయి.

ఆల్బంలో పేజీలు మరి తిప్పలేదు. సోమయాజులుగారికి చెప్పి అడ్రసు తీసుకున్నాను. రుక్మిణి గారింటికి వెళ్ళి అన్ని విషయాలు మాట్లాడుకొంటానని చెప్పాను. పెళ్ళి నిశ్చయమైతే అనుకొన్నట్లుగా అంతా ఇచ్చేస్తానన్నాను.

'మంచిద'ని నిండు మనసుతో దీవించారు సోమయాజులుగారు.

ఆ తర్వాత...

కథ నడవటానికి ఎక్కువకాలం పట్టలేదు. సూర్యాన్ని తీసుకుని రుక్మిణి వాళ్ళఇంటికి వెళ్ళాను. నాలుగు పోర్షన్లున్న ఇంట్లో వీళ్ళది ఒక దాంట్లో సగం పోర్షన్. తండ్రి ఎప్పుడో పోయారు. తల్లికి వచ్చే పింఛను మీదే కుటుంబం గడుస్తోంది. 'ఇప్పటికి గడుస్తోంది. కానీ ఇంకెన్నాళ్లో ఇలా కూడా గడిచేలా లేదు!' అంది తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటూ..

చేతిలో కానీ లేదని, జీవితం అంటే ఆసక్తి చచ్చిపోయిందని, ఎపుడైనా ఏదో క్షణంలో ఏ దేవుడో ఆదుకోడా అన్న నమ్మకంతో బతుకును ఈడ్చుకొస్తున్నామని నిజాయితీతో కడుపు చించుకుని మరీ నా కళ్ళముందు వాళ్ళు తమ జీవితాన్ని పరిచారు.

రుక్మిణి నాకు నచ్చింది. పేరుకు తగ్గ నమ్రత ఆమెలో నాకు కనబడింది. ఏ భేషజమూ పోకుండా ఓ కప్పు కాఫీ మాత్రమే ఇచ్చారు. నేను దీనికి జవాబుగా రుక్మిణినే పెళ్ళి చేసుకొంటానని మరీ మాట ఇచ్చి వచ్చాను. ఇక మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళింది నేను పెళ్ళి ముహూర్తాన్ని నిర్ణయించుకొన్నాకనే. ఆ విషయం విని ఆ తల్లి కన్నీరు పెట్టుకొంది. రుక్మిణి తన కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పుకొంది.

అపుడు బయట పెట్టాను నా మనసులోని కోరికను "మీరేమీ అనుకోనంటే... రుక్మిణిని నేను రేపొకసారి బయటికి తీసుకెడతా! యాజులుగారింటివరకు!..." అన్నాను.

పెళ్ళికాకమునుపు... పెళ్ళి సెటిలయ్యాకకూడా అమ్మాయిని అబ్బాయితో పంపటానికి ఒప్పుకోరు చాలామంది! అయినా ఆవిడ ఏమీ అనలేదు.

రుక్మిణి అంది... " వెళ్ళొస్తానమ్మా! సోమయాజులుగారికి మనం ఎంతైనా రుణపడి ఉంటాం! ఆ సంగతి చెప్పివస్తా"

ఆ తల్లి 'సరే'నంది.

నేనూ, రుక్మిణీ వెళ్ళి సోమయాజులుగారికి పెళ్ళి సెటిలయిన సంగతి చెప్పాం. ఆయనెంతో సంతోషించారు. భార్యను పిలిచి మా ఇద్దర్నీ పరిచయం చేశారు. ఆ దంపతుల్ని

చూసి నాకెందుకో వాళ్ళ కాళ్ళకు దణ్ణం పెట్టాలనిపించింది. నేను దణ్ణం పెడుతుంటే రుక్మిణీ వచ్చి నాతో పాలు పంచుకొంది. రుక్మిణి మీద నాకు నమ్మకం రెట్టింపయింది.

తిరిగిరాబోతుంటే.. నేనే ఆగి జేబులోంచి కవరు తీశాను. అందులో వెయ్యిన్నూటపదహార్లున్నాయి. ముందనుకొన్న ఫీజే అది! సోమయాజులుగారికి అందించబోయాను. ఆయన నవ్వుతూ నిలబడ్డారు. కాని తీసుకోలేదు.

రూపాయినోటు చేత్తో పట్టుకుని నిలబడితే వంద చేతులు ఒక్కసారి మీద పడి లాక్కునిపోయే రోజులివి. నా అంతట నేనే ఆయనకు వెయ్యికి మించిన మొత్తాన్ని ఇస్తోంటే ఆయన అందుకోనేలేదు. నాకు చిత్రంగా తోచింది అదే అన్నాను.

"పెళ్ళిరోజున ఇద్దువుగానిలే. ఉంచు! ఇపుడెన్ని ఖర్చులు ఉంటాయో! నా సంగతి ఆఖరికి అట్టిపెట్టు!" అన్నాడాయన నవ్వుతూ.

డబ్బులివ్వకుండానే తిరిగి వచ్చేశాం. నేనూ, రుక్మిణీనూ!

ఆ తర్వాత మా ఇద్దరి పెళ్ళి ఇంకో మూడు రోజులుందనగా వెళ్ళి ఆయనను పిలిచాం నేనూ, సూర్యమూ వెళ్ళి.

"మంచిది నాయనా! ఒక మంచి ఆశయంతో పెళ్ళి చేసుకుంటున్నావు! సంతోషం! కాని ఒకటి గుర్తుంచుకో, అనవసరమైన వాటికి ఖర్చుపెట్టి ఇబ్బందుల పాలవకు! వీలైనంత తక్కువ ఖర్చు పెట్టుకో!" అన్నారు సోమయాజులు.

బయటకు వచ్చాక సూర్యం పకపక నవ్వాడు! "పొదుపు చెయ్యమంటున్నాడ్రా గురుడు! ఆయనకు ఇవ్వాల్సిన డబ్బు ఎగగొట్టడం దగ్గర మొదలు పెట్టు నీ పొదుపు! అన్నాడు.

నాకు చిన్నతనంగా అనిపించింది. చికాగ్గా అనిపించింది! సూర్యం చెప్పినట్లు చేస్తే రేపెప్పుడూ నేను అద్దంలో నా ముఖాన్నే చూసుకోలేనన్నది నిజం! అంత క్షమార్హం కాని నేరమది!

కానీ నా అభిప్రాయాన్ని సూర్యం ముందు వ్యక్తం చేయలేదు నేను. విలువలు ఏమీ లేనంటున్న వాడిముందు ఇలాంటివి చెప్పి నవ్వులపాలు కావటం ఇష్టం లేదు నాకు.

– పెళ్ళయిపోయింది.

'యాజీ మ్యారేజ్ బ్యూరో' పుణ్యమాని నేనూ, రుక్మిణీ ఏకమయ్యాము. రుక్మిణి మెడలో మూడు ముళ్ళు వేశాక సోమయాజులుగారి దగ్గరకు వెళ్ళి దణ్ణం పెట్టాము. అంత హడావిడిలో కూడా నేను నా పంచె మడతలోంచి తీసి వెయ్యినూటపదహార్ల కవరు ఆయనకు అందించబోయాను. సోమయాజులుగారు అదేమీ పట్టించుకోలేదు. మరీ ఎక్కువ స్ట్రెస్ దానికే ఇస్తే, అందరికి విషయం తెలుస్తుందని నేను ఊరుకుండిపోయాను.

రుక్మిణిని నాకు అందించిన రుణం వెంటనే తీర్చుకొనే అవకాశం ఆయన నాకెందుకు ఇవ్వటంలేదో నాకు అర్థం కావటంలేదు.

అందుకే...

పెళ్ళయిన రెండోరోజున మళ్ళీ వెళ్ళాం మేం ఇద్దరమూ.

సోమయాజులుగారు లేరప్పుడు. అంతక్రితం ఎపుడైనా ఒకసారి తొంగి చూసి చిరునవ్వులు మాత్రం చిందించి వెళ్ళే సోమయాజులుగారి ఇల్లాలు ఆ రోజున మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. కూర్చున్నాక టిఫిన్, టీ, ఇచ్చారు. అప్పటికీ ఆయన రాకపోయేసరికి జేబులోంచి కవరు తీశాను.

ఆవిడ చిరునవ్వు నవ్వారు.

"అది ఇవ్వాల్సింది నువ్వు కాదు!" అందావిడ. ఆ మాటకు అర్థం తెలీలేదు నాకు. నా ముఖంలోని ప్రశ్న చదివిందేమో ఆమె, నవ్వుకుంటూ ఇంట్లోకి వెళ్ళి తిరిగి వచ్చింది. ఈసారి ఆమె చేతిలో ఒక కవరుంది. "ఇది ఇవ్వాల్సింది మేం!" అంటూనే ఆమె ఆ కవరు రుక్మిణికి అందించారు.

రుక్మిణి విప్పిచూస్తే, ఆ కవరులో రెండు వేల రూపాయలకు ఓ చెక్కు ఉంది. ఉలికిపడ్డాను! సూర్యం ఈ క్షణంలో ఉండి ఉంటే... అనిపించింది. అయినా ఆవిడ దేనికి ఇస్తున్నట్లు ఇది మాకు!... అదే అడిగాను.

ఆవిడ చిన్నగా నిట్టూర్చారు.

ఆ నిట్టూర్పు వెనక ఆవిడ చెప్తున్న గతకాలపు కథ వాసన ఏదో నాకు స్పష్టంగా తెలుస్తోంది. ఎదలోతుల్లోంచి ఉబికి వస్తున్న వ్యధకు ఆవిడ ఆ క్షణంలో అక్షరరూపం కల్పిస్తోందనీ నాకు తెలుస్తూనే ఉంది.

"దాదాపు ఆరేళ్ళ కిందటి సంగతి నాయనా! మా అమ్మాయి అపుడే పెళ్ళీడు కొచ్చింది. తిరగని ఊళ్ళులేవు. తగిన సంబంధాలు చెప్పమని మేం అడగని వారంటూలేరు. సంబంధాలు ఎలా కుదురుతాయో, ఇందరి పెళ్ళిళ్లు ఎలా అవుతున్నాయో అర్థంకాని పరిస్థితి ఏర్పడిపోయింది మాకు! ఆ సమయంలోనే ఓ సంబంధం కుదిరింది. అబ్బాయి లక్షణంగా ఉన్నాడు. ఇంజనీరు, దాదాపు రెండువేల జీతం, పెళ్ళిచూపులకు అమ్మాయిని వాళ్ళ ఊరికే తీసుకెళ్లాం. అమ్మాయి నచ్చింది వాళ్ళకు. నలభై వేల దగ్గర కట్నం కూడా సెటిలయింది. సంబరంతో తిరుగుముఖం పట్టాం. అపుడు జరిగింది ఆ యాక్సిడెంట్! మేం వస్తున్న బస్సుకు వెనుకనున్న ఓ లారీ, దాన్ని ఓవర్‌టేక్ చెయ్యాలని ప్రయత్నిస్తూ, ఈ బస్సుని గుద్దేసింది. ఆ యాక్సిడెంట్‌లో మేం మిగిలాం. మా అమ్మాయి మాత్రం..." ఆవిడ చెప్పలేక ఆగిపోయింది. కన్నీటి తెరలు ఆవిడ చెప్తున్న కథకు అడ్డం అయ్యాయి.

క్షణం తర్వాత ఆవిడ సంబాళించుకొంది.

"అమ్మాయి పెళ్ళికి దాచిన కట్నం మిగిలింది. అమ్మాయి పెళ్ళి చేయాలనే తపన మిగిలింది. అందుకే ఆ కోరిక తీర్చుకొనేందుకే, ఇంకెవరూ మాకు కన్నబిడ్డలు లేకపోవడంతో, ప్రపంచంలో పెళ్ళికాని వాళ్ళంతా మన బిడ్డలేనన్న ధోరణిలో ఈ బ్యూరో పెట్టారాయన! ఇలాగ కొందరు జంటల్ని అయినా కలిపితే, కనీసం వచ్చే జన్మలోనైనా..."

ఆవిడ మళ్ళీ మాటల్ని మింగేసింది.

కానీ, రుక్మిణికిచ్చిన రెండు వేల మాటేమిటి??

"అది మా అమ్మాయికోసం దాచిన కట్నం డబ్బు మీద వడ్డీ! పెళ్ళి జరగనప్పుడు ఇక కట్నం ఖర్చేమిటి? అందుకే దాన్ని బాంకులో వేశాం. కట్నం తీసుకొని పెళ్ళిచేసుకొనే దంపతుల నుంచి ఫీజు వసూలు చేస్తున్నాం. మీలాగ కట్నం తీసుకోని దంపతులకు ఆ డబ్బు మీద వడ్డీని కానుకగా అందిస్తున్నాం. అందుకే ఆ డబ్బు మీకే..." అందావిడ.

నాకు చిత్రంగా తోచింది ఆవిడ చెప్తున్నది వింటూంటే.

తమ జీవితంలోని విషాదాన్ని దిగమింగుకొని, ఇతరుల కోసం శ్రమిస్తూ తమ డబ్బు వాళ్ళకోసం ఖర్చుపెట్టే ఇలాంటి పిచ్చి దంపతులూ ఉంటారా? అనిపించింది నాకు!

నా సందేహానికి జవాబు ఇస్తున్నట్లుగా – 'ఉంటారు'! అంటున్నట్లుగా సోమయాజులుగారు పట్టుపంచెతో ఇంట్లోకి వస్తూ కనిపించారు.

ఒక్కసారిలేచి, ఒక్కడుగు ముందుకువేసి, ఆయనకు రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేశాను.

ఆయన కళ్ళలోంచి జారుతున్న కన్నీరు మా ఇద్దరి జీవితాలు సుఖమయం కావాలని ఆ దంపతులు చిలికిస్తున్న అక్షింతల చిరుజల్లులుగా తోచాయి నాకు.

*– భారతి, మాసపత్రిక, నవంబరు, 1985*